క్లుప్తంగా

మంత్రి పరామర్శ



కాటారం: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను బుధవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పరామర్శించారు. కాటారం మండల కేంద్రానికి చెందిన కొట్టె శ్రీశైలం తల్లి కొట్టె బుచ్చమ్మ మృతి చెందగా ఆమె కుటుంబాన్ని, కొత్తపల్లిలో కుంభం రాంరెడ్డి, ధన్వాడలో చందు కుటుంబాలను మంత్రి పరామర్శించి సానుభూతి తెలిపారు. మంత్రి వెంట రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, నాయకులు నాయిని శ్రీనివాస్, మహేశ్ రవీందర్‌రావు, అంగోతు సుగుణ, కొట్టె ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

మొగుళ్లపల్లిలో..



మొగుళ్లపల్లి : మండల కేంద్రానికి చెందిన మల్సాని ప్రమీల అనారోగ్యంతో సోమవారం మృతి చెందగా వారి కుటుంబాన్ని బుధవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ టౌన్ అధ్యక్షులు క్యాతరాజు రమేష్, మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము నాయకులు ఎలేటి సదాశివరెడ్డి, బద్దం మోహన్ రెడ్డి, పున్నం చందర్‌రావు, కొమురయ్య, మాజీ ఉపసర్పంచ్ నర్సింగరావు, అన్నారెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాస్, జయపాల్ రెడ్డి ఉన్నారు.

ఆర్థికసాయం



టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డిపేటకు చెందిన తుమ్మేటి ఝాన్సీ ఇటీవల మృతి చెందగా బుధవారం ఆమె కుటుంబ సభ్యులను మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి పరామర్శించి ఆర్థికసాయాన్ని అందించారు. అనంతరం మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని భరోసా కల్పించారు. ఆయన వెంట నాయకులు తుమ్మేటి సురేందర్‌రెడ్డి, వంగ ప్రభాకర్, చిలుక మల్లయ్య, సమ్మయ్య, బిక్షపతి, తదితరులు ఉన్నారు.

పైపులైన్ లీకేజీ.. బురదమయంగా రోడ్డు



పైపులైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు



గుంతలో నిలిచిన మురుగు నీరు

- నిల్వనీటితో ఏర్పడిన గుంత
- ఇబ్బందుల్లో వాహనదారులు

టేకుమట్ల : మండలంలోని రామకిష్టాపూర్(వి)లోని డబుల్ బెడ్రూంలకు వెళ్లే మలుపు వద్ద గతంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో నిర్మించిన పశువుల తొట్టి వద్ద పైపులైన్ లీకేజీ కావడంతో నిరంతరం ప్రధానరోడ్డులో మూడు దారుల వద్ద నీటి నిల్వ కావడంతో అక్కడ భారీగా గుంత ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. గుంత మరింత పెద్దగా మారడంతో గుంతలో ఎక్కువగా నీటి నిల్వ పెరిగి దోమలు విజృంభిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు వాపోతున్నారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు దోమల వల్లనే వస్తున్నాయి. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు కానీ, అధికారులు రోడ్డుపై ఉన్న గుంతను పూడ్చడంలో, పశువుల తొట్టి లీకేజీని అరికట్టడంలో విఫలమయ్యారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నిత్యం బూర్నపల్లి నుంచి ఇసుక రవాణా వల్ల రోడ్డు మరింత ధ్వంసం అవుతుందని, కనీసం అక్రమ ఇసుక రవాణాను కూడా అడ్డుకోవడం లేదని విమర్శిస్తున్నారు. భారీవాహనాలతో రోడ్డు మరింత ధ్వంసమవుతున్నందున నీటి తొట్టి లీకేజీని అరికట్టి, బురద గుంటను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులకు అక్కడ ఏర్పడ్డ గుంత ప్రాణసంకటంగా మారింది. అధికారులు సమస్యపై స్పందించి పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న తప్పెట్ల కిషన్

టేకుమట్ల : ప్రతీ ఒక్కరు ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్ తప్పెట్ల కిషన్, వీణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడ్స్ అరక్షిత లైంగిక సంబంధాల వల్ల, కలుషిత సిరంజీ, బ్లేడ్ల ద్వారా, పరీక్షించని రక్తమార్పిడి ద్వారా, హెచ్‌ఐవీ సోకిన తల్లి నుంచి బిడ్డకు సంక్రమిస్తుందన్నారు. హెచ్‌ఐవీ సోకిన వ్యక్తితో కలిసి భోజనం చేసినా, ముట్టుకున్నా, అతని బట్టలు వేసుకున్నా హెచ్‌ఐవీ సోకదని అన్నారు. సమాజంలో మనతో సమానంగా వారిని గౌరవించాలన్నారు. హెచ్‌ఐవీ సోకిన వారు పౌష్టికాహారాన్ని తీసుకుని, మానసికంగా సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శైలజ, పంచాయతీ కార్యదర్శి అడగాని సాంబశివుడు, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

డీఎస్సీ టాపర్‌కు సన్మానం



శివకుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీడీఓ అనిత

టేకుమట్ల : ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని గుమ్మడవెల్లికి చెందిన మారం శివకుమార్‌రెడ్డి స్కూల్ అసిస్టెంట్(మ్యాథమెటిక్స్)లో జిల్లా ప్రథమ ర్యాంకు సాధించాడు. కాగా బుధవారం శివకుమార్‌రెడ్డిని ఎంపీడీఓ అనిత శాలువాతో ఘనంగా సన్మానించారు. శివకుమార్‌రెడ్డి మొగుళ్లపల్లిలోని గురుకుల పాఠశాలలో టీజీటీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్దులపల్లిలో 'రేబిస్' నివారణ టీకాలు



టీకా వేస్తున్న పశువైద్యాధికారి రాజబాపు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మద్దులపల్లిలో పిచ్చికుక్క కాటుకు గురైన గేదెలకు, ముందస్తుగా మిగిలిన గేదెలకు కలిపి సుమారు 220 గేదెలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు మహదేవపూర్ పశువైద్యాధికారి బుర్ర రాజబాపు బుధవారం వేశారు. ఈసందర్భంగా గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. పశువైద్యాధికారి మాట్లాడుతూ కుక్కకాటుపై నిర్లక్ష్యం చేయవద్దని అప్రమత్తంగా ఉండాలని పాడి రైతులకు అవగాహన నిర్వహించారు. కుక్క కరిస్తేనే ప్రాణాంతకమని భావించవద్దు. గోళ్లతో గీరిన, రక్కిన పండ్లు గీసుకపోయిన, అంతకుముందే ఉన్న గాయాలపై నాకిన, తినే ఆహారంలో మూతి పెట్టినా, తాగే నీటిలో చొంగ కార్చినా రేబిస్ వ్యాధి రావడానికి మార్గాలుగా భావించాలని రైతులకు సూచించారు. వ్యాధి లక్షణాలు తొమ్మిది రోజుల నుంచి కొన్ని నెలల్లోపు కూడా బయటపడవచ్చు. రేబిస్ వ్యాధిని హైడ్రో ఫోబీయా అని కూడా అంటారు. నీళ్లు చూస్తే కూడా గేదెలు భయపడుతాయి. కండరాలు బిగుసుకుపోవడం, ఫిట్స్ రావడం వంటి అనేక లక్షణాలు కూడా ఉంటాయి. పెంపుడు కుక్క అయినా యాంటీరేబీస్ ఇంజక్షన్లు వేయించుకోవాలి. వ్యాక్సిన్ మొదలు పెట్టిన రోజును జీరోగా తరువాత 3, 7, 14,. 30, 90 రోజుల్లో వ్యాక్సిన్ వేయించుకోవాలని పాడి రైతులకు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది కళ్యాణ్, లక్ష్మణ్, గ్రామ పాడి రైతులు పాల్గొన్నారు.

కల్తీ పురుగు మందు విక్రయం

- చేనుకు స్ప్రే చేయడంతో నష్టం

కాటారం: మండల కేంద్రంలోని ఓ ఫెర్టిలైజర్ షాపులో కొనుగోలు చేసిన కల్తీ, గడువు దాటిన పురుగు మందును రైతు తనపత్తి పంటకు స్ప్రే చేయడంతో పంట మొత్తం వాడిపోయింది. ఈ సంఘటనపై సదరు రైతు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహాముత్తారం మండలం యామన్‌పల్లికి చెందిన రాంచందర్ తన పత్తి పంటలో ఇగురు, గూడు రావడానికి గత నెల 14న మండల కేంద్రంలోని ఓ ఫెర్టిలైజర్ షాపుకు వచ్చాడు. పంటలో సమస్య చెప్పడంతో సదరు షాపు యజమాని తన వద్ద రూ.1900 తీసుకొని 2 లీటర్ల ఇగురుమందు ఇచ్చినట్లు రైతు తెలిపాడు. రెండెకరాల చేనుకు మందు స్ప్రే చేయడంతో వారం రోజులకు పత్తి చెట్లు మొత్తం ఆకు మాడిపోవడంతో పాటు చెట్ల పూత, గూడు రాలిపోయిందని రైతు ఆరోపించాడు. సదరు ఫెర్టిలైజర్ దుకాణం యజమానిని ఫోన్ చేసి అడగగా దుకాణానికి వచ్చి మరొక మందు ఇస్తాను తీసుకెళ్లు అని తెలపడంతో దుకాణం వద్దకు వచ్చి ప్రశ్నించగా యజమాని తీవ్ర దుర్భాషలాడినట్లు రైతు పేర్కొన్నారు. షాపు యజమాని కల్తీ, గడువు దాటిన మందు ఇవ్వడంతో పంట మొత్తం నాశనం అయి రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు వ్యవసాయశాఖ అధికారులకు సైతం ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారిణి పూర్ణిమ వివరణ కోసం ఫోన్‌లో సంప్రదించగా ఆమె స్పందించలేదు.

టేకుమట్ల : రాఘవరెడ్డిపేటలో...



టేకుమట్లలో...



ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ

మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం బతుకమ్మ సంబురాలు ప్రారంభమయ్యాయి. స్థానిక శివాలయం దగ్గర చిన్నలు, పెద్దలు, యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో తంగేడు,గునుగు తదితర పూలతో బతుకమ్మలను పేర్చుకొని గ్రామాలలోని ఆలయాలకు తీసుకెళ్లి బతుకమ్మలను ఒక్క దగ్గర చేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ,కోలాటాలు వేస్తూ మహిళలు,పిల్లలు బతుకమ్మ తొలి రోజు పండుగను ప్రారంభించుకున్నారు. - సాక్షి, నెట్‌వర్క్



మొగుళ్లపల్లి : మండల కేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



చిట్యాల : కైలాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు





గణపురం : మండలకేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, బతుకమ్మతో చిన్నారి



మొగుళ్లపల్లి: బతుకమ్మతో చిన్నారులు,



కొత్తపల్లిగోరిలో,



మల్హర్ : తాడిచర్లలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఘనంగా గాంధీ జయంతి

గాంధీజీ జయంతి వేడుకలను బుధవారం జిల్లా కేంద్రంతో పాటు టేకుమట్ల, మల్హర్, మొగుళ్లపల్లి, కాటారం, మహాముత్తారం మండల కేంద్రాల్లో, మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతో పాటు వివిధ పార్టీ కార్యాలయాల్లో గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర పోరాటంలో ఆయన చేసిన పోరాటాలు ఉద్యమాల గురించి గుర్తు చేశారు. గాంధీ చూపిన అహింస మార్గంలో యువత ముందుకు వెళ్లాలని సూచించారు. గాంధీ ఆశయాల కోసం పాటు పడాలని కొనియాడారు. ములుగుపల్లి, సింగంపల్లి గ్రామ పంచాయితీల్లో పిరమల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామస్తులు, విద్యార్థులు, యువతతో కలిసి అధికారులు ర్యాలీ నిర్వహించారు. భూపాలపల్లిమున్సిపాలిటీ పరిధి సుభాష్‌కాలనీలో ఉన్న గాంధీ విగ్రహానికి బీజేపీ పార్టీ అర్బన్ అధ్యక్షుడు మధుసుదన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ఓబీసీ జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వృద్ధులకు, రోగులకు పండ్లు,పాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వైద్యులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



మొగుళ్లపల్లి : తహసీల్దార్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న తహసీల్దార్ సునీత



రేగొండ : ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో...



మల్హర్ : ఎంపీడీఓ కార్యాలయంలో...



మల్హర్ : శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎంపీడీఓ



భూపాలపల్లి అర్బన్ : సంఘమిత్ర డిగ్రీ కళాశాలలో..



కాటారం : తహసీల్ కార్యాలయంలో ..



భూపాలపల్లి రూరల్‌లో..



టేకుమట్ల : పోలీస్‌స్టేషన్‌లో..



రేగొండ : గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మెకానిక్‌లకు గుర్తింపు కార్డుల పంపిణీ



గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: పట్టణంలోని జవహర్‌నగర్ ఏరియాలో భూపాలపల్లి టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టూ వీలర్ మెకానిక్స్‌కు ఎమ్మెల్యే గుర్తింపు కార్డులను అందజేశారు. అనంతరం భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్‌తో కలిసి టూ వీలర్స్ కు సంబంధించిన నూతన ధరల పట్టికను విడుదల చేశారు. మెకానిక్ అసోసియేషన్ నాయకులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించగా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మెకానిక్ అసోసియేషన్ నాయకులు, కౌన్సిలర్లు శ్రీనివాస్, రవీందర్, పార్టీ నాయకులు, మధు, రాజేందర్, కిషన్, సాంబమూర్తి, మెకానిక్‌లు పాల్గొన్నారు.

చదువుల తల్లికి చేయూత



సాత్వికకు ఆర్థికసాయం చేస్తున్న బ్లడ్ డోనర్స్

ఏటూరునాగారం: మండలంలోని బూటారం గ్రామానికి చెందిన ఆదివాసీ విద్యార్థిని సాత్విక ఉన్నత చదువుల కోసం బ్లడ్ డోనర్స్ ఆధ్వర్యంలో రూ. 12 వేలు ఆర్థికసాయం బుధవారం అందజేశారు. ఎంబీబీఎస్ సీటు సాధించిన సాత్వికకు ఇతర ఖర్చుల కోసం సాయం అందజేసినట్లు బ్లడ్ డోనర్స్ అధ్యక్షుడు సయ్యద్ వహీద్, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గండెపల్లి సత్యం అన్నారు. కార్యక్రమంలో సుకేష్, మహేష్, లక్ష్మీనారాయణ, నగేష్, మున్నా, ఆసీఫా రెహమాన్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అండగా ఉంటాం

ఎంబీబీఎస్ సీటు సాధించిన పేద విద్యార్థికి అండగా ఉంటామని ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తన స్వగృహంలో సాత్వికకు రూ. 10వేల ఆర్థిక సాయాన్ని బీఆర్‌ఎస్ నాయకుడు ప్రదీప్‌రావు, పార్టీనాయకుల చేతుల మీదుగా అందజేశారు. ప్రదీప్‌రావు, భాస్కర్‌రావు, రఘు, మల్లారెడ్డి, పుల్లయ్య, మహమ్మద్ ఖలీల్, నాగరాజు, కిరణ్, వెంకటేశ్వర్లు, ఎల్ల య్య పాల్గొన్నారు.

బ్రహ్మదేవ్ వెల్ఫేర్ ద్వారా..

సాత్వికను ఆదుకునేందుకు బ్రహ్మదేవ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు బుధవారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. అధ్యక్షుడు స మ్మయ్య, లక్ష్మీనారాయణ, ప్రసాద్, రాంబాబు, రాంచందర్‌రావు, నారాయణ, మధుసూదన్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

వాజేడు : మండలంలోని మొరుమూరు గ్రామ పంచాయతీలో క్రీడల్లో గెలిచిన వారికి బుధవారం బహుమతులను ప్రదానం చేశారు. సెప్టెంబర్ 21న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆటల పోటీలను నిర్వహించారు. విజేతలకు గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి అర్షద్ అహ్మద్ చేతుల మీదుగా బహుమతులను అందించారు. జీపీ కార్యదర్శి కార్తీక్, సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలను పూడ్చండి



టేకుమట్ల : మండలంలోని వెలిశాల విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి రామకిష్టాపూర్(వి) ఎస్సీ కాలనీ వరకు సుమారు 400 మీటర్ల మేర ప్రధాన రోడ్డు పూర్తిగా ధ్వంసమై భారీ గుంతలు ఏర్పడ్డాయి. మండలంలోని ద్వారకపేట, బూర్నపల్లి, వెంకట్రావుపల్లి గ్రామాల ప్రజలు నిత్యం మండల కేంద్రానికి వ్యక్తిగత, వాణిజ్య, అధికార కార్యాలయాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి వేళల్లో మరీ దారుణం ఉంటుంది. ఇటీవల రాత్రి వేళలో రామకిష్టాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై నుంచి పడి గాయాల పాలయ్యాడు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ స్పందించి నిధులు కేటాయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.